నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 29 జూన్ 2024 | HYDERABAD


## అయ్యో..పాపం



శామీర్‌పేట, జూన్ 28: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి రెండేండ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణంలో హెచ్‌ఎండీఏ శాఖ ఆధ్వర్యంలో నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందులో రోజువారీ కూలీలుగా మధ్యప్రదేశ్‌కు చెందిన రేష్మి, సురేంద్ర దంపతులు పనిచేస్తున్నారు. రోజు వారీగా శుక్రవారం వీరు పనిలో నిమగ్నమవ్వగా, వీరి కుమారుడు మానవ్(2) సమీపంలోనే ఆడుకుంటూ..ప్రమాదవశాత్తు నర్సరీ కోసం తీసిన నీటి సంపులో పడి మునిగిపోయాడు. బాలుడిని బయటకు తీసి.. తూంకుంట, అల్వాల్‌లోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.




సీఎస్‌ఆర్‌లో భాగంగా నిలోఫర్ వైద్యశాలకు హెచ్‌ఏఎల్ రూ.20.22 కోట్ల వితరణ చేసింది. వైద్యశాలలోని ఓపీడీ భవన నిర్మాణానికి రూ.10.20 కోట్లు.. ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు రూ.10.02 కోట్లను హెచ్‌ఏఎల్ హైదరాబాద్ ఏవియానిక్స్ డివిజన్ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం హెచ్‌ఏఎల్, నిలోఫర్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నది. హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణికి ఎంవోయూ పత్రం అందజేశారు. -జూబ్లీహిల్స్

### షాకిచ్చిన మందుబాబు..

### ఏకంగా బ్రీత్ అనలైజర్‌తోనే..

బొల్లారం, జూన్ 28: ట్రాఫిక్ పోలీసులకు ఓ మందుబాబు షాకిచ్చాడు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తుండగా..ఆ పరికరంతో మందుబాబు పారిపోయాడు. గురువారం రాత్రి బోయిన్‌పల్లి పోలీసులు పుల్లారెడ్డి ఇంటి సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్నారు. ఇంతలో ఓ కారులోని డ్రైవర్‌ను పరీక్షిస్తుండగా, బ్రీత్ ఎన్‌లైజర్‌తో ఆ మందుబాబు ఉడాయించాడు. చీకటిగా ఉండటం..కారు స్పీడ్‌గా వెళ్లడంతో అతను ఎవరనేది గుర్తించలేకపోయారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని.. మందుబాబు కోసం గాలిస్తున్నారు.

# నాలా..ఇలాగైతే ఎలా?

**పైపైనే పూడికతీత...నేటికీ 81 శాతమే పూర్తి**

త్వరగా ముగించాలన్న హడావుడి.. పారదర్శకతకు పాతర

**ప్రజావాణి, టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదుల వెల్లువ**

కొందరు కాంట్రాక్టర్ల ఇష్టానుసారం పనులపై 'విజిలెన్స్'





వ్యర్థాలతో నిండిపోయిన మణికొండ, దర్గా ఓయూ కాలనీలోని నాలాలు

సిటీబ్యూరో, జూన్ 28 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో నాలా పూడికతీత పనుల్లో జీహెచ్‌ఎంసీ అలసత్వం ప్రదర్శిస్తోంది. గత నెల 31వ తేదీ నాటికే నిర్దేశిత గడువు పూర్తి చేసుకొని వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పనులపై నిర్లక్ష్యం చూపారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా.. నేటికీ నాలాల పూడికతీత పనులు కొనసాగుతుండటం అధికారుల పనితీరుకు అద్దంపడుతోంది.నిర్దేశిత లక్ష్యంలోపు పూర్తి చేయకపోవడం, ప్రస్తుతం 81 శాతం మాత్రమే పూర్తి చేయడం, పైగా నెలాఖరు వస్తుండటంతో హడావుడిగా నాలాల పూడికతీత పనులు జరుగుతున్నాయి. పర్యవేక్షించే వారు లేకపోవడంతో అడుగు భాగంలో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలు ముట్టుకోవడం లేదు. పైన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తీసేస్తున్నారు. తీసేసిన కొద్ది పాటి పూడికనూ రోడ్డుపైనే వదిలేస్తున్నారు. అయితే పూడికతీత పనులపై ఇంజినీర్ల పర్యవేక్షణ కొరవడంతో కొందరు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. పూడికతీత పనులు పారదర్శకంగా జరగడం లేదన్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. మొత్తంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో పూడికతీత పనులు పారదర్శకంగా జరగడం లేదు. నాలా పరీవాహక ప్రాంత ప్రజలు భారీ వర్షం వస్తే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవించాల్సిన పరిస్థితి నెలకొన్నదని పలువురు వాపోతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యమే..

జీహెచ్‌ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా...390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రైయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పనులను సకాలంలో చేయకుండా వరద నీటి ముంపునకు అధికారులు కారణమవుతున్నారు. గతేడాది 63 చోట్లకు గానూ రూ. 53.60కోట్ల అంచనాతో 945 కిలోమీటర్ల మేర పూడికతీత పనులను చేపట్టి..3.04 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత వెలికితీశారు. ఇందు కోసం రూ. 36.58కోట్లు ఖర్చు చేశారు. ఇదే ఏడాది 201 చోట్ల పనులకు రూ. 56.38 కోట్ల అంచనాతో 919 కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం 3.12 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికను వెలికితీసినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు పడుతున్నా..81 శాతం పనులు మాత్రమే పూర్తి చేయడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది.

## పదే పదే పవర్ కట్...

**ఒక్కసారి పోతే ..**

**వచ్చేది గంట తర్వాతే...**



సిటీబ్యూరో, జూన్ 28 (నమస్తే తెలంగాణ):తెలంగాణలో విద్యుత్ కోతలు లేవంటూ ఓ వైపు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేస్తుంటే.. అదే సమయంలో తమ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోందంటూ ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ అంతరాయాలు నిత్యకృత్యం అన్నట్లు మారాయి. తాజాగా శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మీర్‌పేట టీచర్స్ కాలనీలో గంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా హబ్సిగూడ సర్కిల్ పరిధిలోని 11 కేవీ వెంకటసాయి నగర్ ఫీడర్ పరిధిలోనూ సరఫరా నిలిచిపోగా, సికింద్రాబాద్ సర్కిల్‌లోని 11కేవీ అంజయ్య నగర్‌లో ఫీడర్‌లోనూ అంతరాయం ఏర్పడింది. ఇలా 9 సర్కిళ్లలో ఏదో ఒక ఫీడర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. సరఫరా పునరుద్ధరణకు అర గంట నుంచి గంట సమయం పడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఏ మాత్రం వర్షం కురిసినా.. కరెంటు పోతోందని, విద్యుత్ శాఖ అధికారులు లైన్లలో మరమ్మతులు సరిగా చేయకపోవడం వల్లే తరచూ కరెంటు పోతోందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

## ఇందిరాగాంధీ చౌరస్తాను అభివృద్ధి చేయాలి

కూడలిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ధర్నా



అల్వాల్ సర్కిల్ ఇందిరాగాంధీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జూన్ 28: ఇందిరాగాంధీ చౌరస్తాను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అల్వాల్ సర్కిల్ ఇందిరాగాంధీ చౌరస్తాను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం చూపుతున్న మొండి వైఖరికి నిరసనగా ఎమ్మెల్యే ధర్నా చేశారు. ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు, ఎస్‌ఐలు ప్రకాశ్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ రాజేందర్‌తో కలిసి చౌరస్తాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చౌరస్తా అభివృద్ధి కోసం కేసీఆర్ నిధులు మంజూరు చేశారన్నారు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు చౌరస్తాను అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చౌరస్తా అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, పరమేశ్, రమేశ్, పుదారి రాజేశ్‌కన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఆహారం తినకండి

**రెస్టారెంట్లు..హోటళ్లలో నో క్వాలిటీ**

ఆహారప్రియులను ఆలోచనలో పడేస్తున్న 'ఫుడ్‌సేఫ్టీ'

రెండున్నర నెలల వ్యవధిలో 129 చోట్ల తనిఖీలు

90 మంది వ్యాపారస్తులకు షోకాజ్ నోటీసులు

ఆహార నాణ్యతపై అనుమానాలుంటే..

**040- 2111 1111** కు ఫిర్యాదు చేయండి

జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి బాలాజీ

సిటీబ్యూరో, జూన్ 28 (నమస్తే తెలంగాణ ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ.. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్‌మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గత ఏప్రిల్ నెల నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ కలిపి జీహెచ్‌ఎంసీ పరిధిలో 104, జీహెచ్‌ఎంసీ అవతల 25 కలిపి మొత్తం 129 చోట్ల తనిఖీలు చేపట్టారు. వంటగది అపరిశుభ్రత మొదలు, నాణ్యత లేని ఆహార పదార్థాలు, కుళ్లిపోయిన మాంసం, పురుగులు పట్టిన బిర్యానీ వంటివి అందిస్తున్న 90 మంది వ్యాపారస్తులకు జరిమానాలతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పద్ధతి మార్చుకోవాలంటూ 30 మంది కి హెచ్చరిక నోటీసులు జారీ చేశారు.



### అత్యధికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లే..

మెరుగైన పౌర సేవలు, ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు కల్తీరాయుళ్ల భరతం పట్టాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే గడిచిన రెండున్నర నెలలుగా నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఐస్ క్రీం పార్లర్లపై చర్యలు తీసుకున్నారు. దాదాపు 120కు పైగా వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకుంటే..అందులో అత్యధికంగా పేరొందిన హోటళ్లు, రెస్టారెంట్లు ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఆహార నాణ్యత ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్‌ఎంసీ టోల్ ఫ్రీ నంబరు 040-2111 1111లో సంప్రదించాలని ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి బాలాజీ సూచించారు.

### విస్తుపోయే నిజాలు

కోటికి పైగా జనాభా కలిగిన గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయిల్ నుంచి మొదలు ఉప్పు దాకా నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. జీహెచ్‌ఎంసీ స్టాంప్ వేసిన మాంసాన్ని వాడాలి. కానీ నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంటగదుల్లో పరిశుభ్రత పాటించడం లేదు. ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను ప్రోత్సహిస్తున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మసాలాలు దట్టించి.. మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వచ్చిన సందర్భాలు లేకపోలేదు. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్లు ఉంటున్నాయి. జీహెచ్‌ఎంసీకి నిత్యం 100కు వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి.

## హలో..ఫెడెక్స్ నుంచి..

**మీ పేరుపై డ్రగ్స్ పార్సిల్ వచ్చింది..**

నగరవాసికి సైబర్ నేరగాళ్ల బెదిరింపు

ఖాతా నుంచి రూ.18 లక్షలు స్వాహా

సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

ఓ కానిస్టేబుల్ సమయస్ఫూర్తి..

**11 నిమిషాల్లోనే పోయిన డబ్బు ఫ్రీజ్**



సిటీబ్యూరో, జూన్ 28(నమస్తే తెలంగాణ): 'మీ పేరు మీద డ్రగ్స్ సరఫరా జరుగుతోందం'టూ నగరవాసిని సైబర్ నేరగాళ్లు బెదిరించడమే కాకుండా అతడి ఖాతా నుంచి రూ. 18 లక్షలు స్వాహా చేశారు. అయితే తనకు జరిగిన మోసాన్ని పసిగట్టిన బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే నగర సైబర్ క్రైమ్ పోలీసులు.. సైబర్‌నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లిన డబ్బులను కేవలం 11 నిమిషాల్లోనే ఫ్రీజ్ చేయగలిగారు. అంబర్‌పేటకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి, తాను ఫెడెక్స్ కొరియర్ ఏజెన్సీ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పాడు. 'ఎవరో మీ ఆధార్ కార్డును ఉపయోగించి.. ముంబై నుంచి ఇరాన్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు' అని తెలిపాడు. 'మీరు ముంబై సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించండి' అంటూ వెంటనే స్కైప్ ద్వారా మరో వ్యక్తితో మాట్లాడించాడు. ఆ తర్వాత సదరు గుర్తు తెలియని వ్యక్తి బాధితుడితో మాట్లాడుతూ.. విచారణలో భాగంగా కొంత డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, వెరిఫికేషన్ తరువాత 'మీ డబ్బు మీకు తిరిగి ఇచ్చేస్తామ'న్నాడు. అయితే తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో పర్సనల్ లోన్ తీసి చెల్లించాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు.. బ్యాంక్ నుంచి రూ. 18 లక్షల పర్సనల్ లోన్ తీశాడు. నిందితులు సూచించిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. కానీ ఎంతకూ తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు.. వెంటనే ఈనెల 27న నగరంలోని సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న డ్యూటీ కానిస్టేబుల్ శ్రీకాంత్ నాయక్ వెంటనే ఫిర్యాదు స్వీకరించారు. ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో కేసు నమోదు చేయడంతో పాటు ఐసీఐసీఐ బ్యాంక్‌తో పాటు బాధితుడి అకౌంట్ నుంచి డబ్బు మార్పిడి జరిగిన సైబర్ మోసగాళ్ల ఖాతాలన్నింటినీ ఫ్రీజ్ చేశారు. ఈ క్రమంలోనే బాధితుడి అకౌంట్ నుంచి నిందితుడి ఖాతాలోకి బదిలీ అయిన రూ. 18 లక్షల ఫ్రీజ్ అయ్యాయి. సమయస్ఫూర్తి, సమర్థతతో పనిచేసి బాధితుడికి చెందిన డబ్బులను సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా కేవలం 11 నిమిషాల్లోనే చర్యలు తీసుకున్న కానిస్టేబుల్ శ్రీకాంత్ నాయక్‌ను ఈ సందర్భంగా సైబర్‌క్రైమ్ డీసీపీ అభినందించారు. విధి నిర్వహణలో సమర్థత చాటుకున్నందుకు రివార్డును ప్రకటించారు.



శుక్రవారం హైటెక్ సిటీరోడ్‌లో కురుస్తున్న వాన

### వర్షసూచన

సిటీబ్యూరో : ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రాత్రి 9గంటల వరకు అడ్డగుట్టలో 1.28 సెం.మీలు, మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో 1.28 , వినాయక్‌నగర్, మల్లాపూర్, మౌలాలి, వెస్ట్ మారేడ్‌పల్లి, పికెట్ తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ వెల్లడించింది. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 30.8, కనిష్ఠం 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 60శాతంగా నమోదైనట్లు అధికారులు వివరించారు.


